# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 10-08-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ‘అడవి తల్లి బాట’ పేరిట 625 గిరిజన ఆవాసాలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పిస్తున్నామని ఉపముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ తెలిపారు.
- తాండవ రిజర్వాయర్ నీటిని ఆయకట్టు రైతులు సద్వినియోగం చేసుకోవాలని శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు కోరారు.
- రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.
- ఆగస్టు 15నుండి “స్త్రీ శక్తి” పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

==================================

‘అడవి తల్లి బాట’ పేరిట గిరిజన ప్రాంతాల్లో చేపట్టిన నూతన రహదారుల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కల్యాణ్ అధికారులను ఆదేశించారు. గిరిజన ప్రాంతాల్లో రహదారి పనుల స్థితిగతులపై పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి ఉన్నతాధికారులతో ఈరోజు ఆయన శ్రవణమాధ్యమంలో సమీక్ష నిర్వహించారు. పీఎం జన్ మన్ పథకంతో పాటు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, ఉప ప్రణాళిక నిధులు కలిపి మొత్తం ఒక వెయ్యి ఐదు కోట్ల రూపాయలతో గిరిజన ప్రాంతాల్లో రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. ఈ పనులు పూర్తయితే 625 గిరిజన ఆవాసాలకు మెరుగైన రహదారి సౌకర్యం లభిస్తుందని పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

==================================

అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలోని తాండవ రిజర్వాయర్ నీటిని రాష్ట్ర శాసన సభాపతి చింతకాయల అయ్యన్న పాత్రుడు ఈరోజు విడుదల చేశారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... తాండవ రిజర్వాయర్ నీటిని ఆయకట్టు రైతులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గత ఏడాది 2 కోట్ల 10 లక్షల రూపాయల విపత్తు

నివారణ నిధితో తాండవ ప్రాజెక్టు అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. ఆయకట్టుకు 2 నెలలకు సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని వెల్లడించారు.

అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న హోం మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ... ఈ రిజర్వాయర్ ద్వారా 50 వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నామని తెలిపారు. తుని, పాయకరావుపేట, నర్సీపట్నం నియోజకవర్గాల పరిధిలోని రైతులు ఈ రిజర్వాయర్‌పై ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారని వెల్లడించారు. తమ ప్రభుత్వంలో పంటలకు గిట్టుబాట ధర కల్పిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు.

====================================

రైల్వే ప్రయాణికులు తమ ప్రయాణంలో ఎటువంటి  సమస్యలను ఎదుర్కొన్నా వాటిని రైల్ మదద్ యాప్, వెబ్ సైట్ లో ఫిర్యాదు చేయవచ్చని విజయవాడ డివిజనల్ మేనేజర్ మోహిత్ సోనాకియా తెలిపారు. ప్రయాణం, సరకు రవాణా, పార్శిల్ డెలివరీ వంటి సమస్యలపై ఈ యాప్‌లో ఫిర్యాదు చేస్తే సత్వర పరిష్కారం లభిస్తుందని ఈరోజు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫిర్యాదులు చేయడం మాత్రమే కాకుండా, ప్రయాణికులు రైల్వేకు సలహాలు, సూచనలు కూడా 'రైల్ మదద్' ప్లాట్‌ఫామ్ ద్వారా అందించవచ్చని మోహిత్ సోనాకియా వివరిస్తూ...

(వాయిస్ 27 సెకన్లు)

====================================

రైతుల అభ్యున్నతి కోసం కూటమి ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రైతుల కోసం వ్యవసాయ శాఖ రూపొందించిన కరపత్రాలను మంత్రి ఈరోజు శ్రీకాకుళంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతుల ఆదాయాన్ని, పంట ఉత్పాదకతను మెరుగుపరచడంతో పాటూ మార్కెట్ సౌకర్యాలను విస్తరించేందుకు సమగ్ర ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. రైతుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల రైతులకు అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు త్రినాథ స్వామి, జగన్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

విరామం

====================================

“స్త్రీ శక్తి” పథకం కింద ఈనెల 15 నుండి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పీ 4 విధానాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ రోజు విజయనగరంలో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఈ ఏడాది కాలంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమప్రాధాన్యంలో అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకం కింద ఇచ్చిన మాట ప్రకారం కేంద్ర ప్రభుత్వ వాటా 2 వేలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా 5 వేల రూపాయలు కలిపి మొత్తం 7 వేల రూపాయలు తొలి విడతగా రైతులకు అందజేశామని చెప్పారు.

====================================

అమృత్ పథకం కింద 27 కోట్ల రూపాయలతో గుంటూరు జిల్లా తెనాలి రైల్వే స్టేషన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఈరోజు పరిశీలించారు. రైల్వే స్టేషన్‌లోని సదుపాయాలపై ప్రయాణికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... అమృత్ పథకంలో భాగంగా దేశంలో మొత్తం రైల్వే స్టేషన్లను విమానాశ్రయాల తరహాలో ఆధునీకరించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంకల్పించారని తెలిపారు. అందులో భాగంగా తెనాలి రైల్వే స్టేషన్ లో చేపట్టిన పనులు 60 శాతం పూర్తి అయ్యాయని వెల్లడించారు. మిగిలిన పనులను డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని పెమ్మసాని చంద్రశేఖర్ తెలియజేశారు.

===================================

రాష్ట్రంలో 50 ఇంటిగ్రేటెడ్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లను త్వరలో ఏర్పాటు చేయనున్నామని స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. తిరుపతిలో పాత్రికేయులతో ఆయన ఈరోజు మాట్లాడుతూ.. దేశంలోనే మొట్టమొదటగా రీసైక్లింగ్ పార్క్ ను కేంద్రప్రభుత్వ నిధులతో తిరుపతిలో ఏర్పాటు చేస్తామన్నారు. కంప్రెస్డ్ బయోగ్యాస్ ను రాష్ట్రంలో ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రప్రదేశ్ గా మారుస్తామని కొమ్మారెడ్డి పట్టాభిరామ్ పేర్కొన్నారు.

===================================

ఉదయగిరి, హిమగిరి అనే రెండు అధునాతన యుద్ధ నౌకలు భారత నౌకాదళంలోకి ప్రవేశించనున్నాయి. ఈ నెల 26న విశాఖపట్నంలో జరగనున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను తూర్పు నౌకాదళం చేస్తోంది. ఈ రెండు అధునాతన ఫ్రంట్ లైన్ నౌకలు భారత నౌకాదళానికి విస్తృత సేవలు అందించనున్నాయి.

===================================

ఉత్తర కర్ణాటక దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 4.5 నుంచి 5.8 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం పేర్కొంది. వాయవ్య బంగాళాఖాతం, దానిని ఆనుకుని ఉన్న పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఈనెల13 నాటికి అల్ప పీడనం ఏర్పడే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. దీంతో ఉత్తర కోస్తాంధ్ర మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని వాతావరణ కేంద్రం అధికారి ఎల్.నారాయణ వివరిస్తూ.....

(వాయిస్ 25 సెకన్లు)

===================================

ఆసియా కప్ 2025 సెప్టెంబర్ 9 నుండి 28వ తేదీ వరకూ జరగనుంది. దుబాయ్, అబుదాబీ ఈ సంవత్సరం ఆసియా కప్ క్రికెట్ మ్యాచ్ లకు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. ఆసియా కప్ తొలి మ్యాచ్ సెప్టెంబర్ 9న అఫ్ఘనిస్థాన్ హాంకాంగ్ జట్ల మధ్య జరగనుంది. మొత్తం 8 జట్లు పాల్గొంటున్న ఈ ఆసియా కప్ ఈ సంవత్సరం టీ-20 ఫార్మాట్ లో జరగనుంది. ఇక భారత్ తన తొలి మ్యాచ్‌ను సెప్టెంబర్ 10 యూఏఈతో ఆడనుంది.

===================================
===================================